క్లుప్తంగా

'స్కిల్‌మాస్టర్' పుస్తకం ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎస్పీ మహేశ్ బీ గీతే

సిరిసిల్లటౌన్: 'స్కిల్‌మాస్టర్' పుస్తకాన్ని ఎస్పీ మహేశ్ బీ గీతే మంగళవారం ఆవిష్కరించారు. 'మాస్టర్ రైటర్స్', 'మాస్టర్ రీడర్స్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ది మాస్టర్ మైండ్స్ స్కూల్స్ చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభను ఎస్పీ అభినందించారు.

జిల్లా అంతటా చిరుజల్లులు

సిరిసిల్లకల్చరల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి చిరుజల్లులు కురిశాయి. జిల్లా కేంద్రంలో అత్యధికంగా 25.3 మి.మీ., ఇల్లంతకుంటలో 23.3, రుద్రంగి 1.0, వేములవాడ రూరల్ 1.6, బోయినపల్లి 3.0, వేములవాడ 7.2 కోనరావుపేట 3.8, ఎల్లారెడ్డిపేట 19.3, గంభీరావుపేట 4.5 తంగళ్లపల్లిలో 10.1 మి.మీ వర్షం కురిసింది. చందుర్తి, వీర్నపల్లి, ముస్తాబాద్ మండలాల్లో పెద్దగా వర్షం పడలేదు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ


రుచిత

సిరిసిల్లఎడ్యుకేషన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్న బోనాల గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న రుచిత రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ థెరిస్సా తెలిపారు. రెండు రోజుల క్రితం హనుమకొండలో జరిగిన జూనియర్ అండ్ సీనియర్ మీట్ అండర్– 16 హాడిల్స్ 80 మీటర్ల పోటీలో రుచిత రెండో స్థానం కైవసం చేసుకుంది. మంగళవారం విద్యార్థిని ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు సరిత, స్వప్న అభినందించారు.

స్పెషల్ పోలీస్ కానిస్టేబుల్‌కు సన్మానం


సన్మానిస్తున్న నాయకులు

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన వస్త్ర వ్యాపారి తుమ్మ రమేశ్, రాధ దంపతుల కుమారుడు రంజిత్‌కుమార్ సర్దాపూర్ బెటాలియన్‌లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంపై పద్మశాలీ సంఘం నాయకులు మంగళవారం సన్మానించారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంఘం అధ్యక్షుడు కూచన నర్సింలు, మాజీ అధ్యక్షుడు గూడూరి రాజమల్లయ్య, చిలువేరి ధర్మయ్య, కొంక రాజు, ద్యావతి రాజు, యాడారపు రాజు, నాగులు, మల్లేశ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న కూర సురేశ్

గంభీరావుపేట: మున్నూరుకాపులు అన్ని రంగాల్లో రాణించాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కూర సురేశ్ పేర్కొన్నారు. గంభీరావుపేటలో మంగళవారం మున్నూరుకాపు సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మున్నూరుకాపులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. మల్లేశం, బోయన్నగారి శ్రీనివాస్, సిరిపురం రవి, బాబు, బోయన్నగారి లింగం, శ్రీనివాస్, పర్శరాములు, పల్లె శ్రీనివాస్, సిరిపురం అంజయ్య, వేశాల రాజు, అక్కపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు పరిశీలన


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో లక్ష్మీనారాయణ పరిశీలించారు. నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని, ప్రభుత్వం కూడా వెనువెంటనే బిల్లులు చెల్లిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి వేణు, కాంగ్రెస్ నాయకులు ఎగుర్ల ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్వరగా పూర్తి చేయాలి

కోనరావుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాసాల మల్లారెడ్డి కోరారు. మంగళవారం మామిడిపల్లిలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎల్లాల రామ్ రెడ్డి, రాజారాం, కార్యదర్శి సతీశ్ తదితరులు ఉన్నారు.

స్థలం లేదు..
సౌకర్యాల్లేవ్

- రోడ్లపైన సంత
- ఇబ్బంది పడుతున్న జనం
- రెండు గ్రామాల్లో ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు
- రాకపోకలకు ఇబ్బంది

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి గ్రామంలో ప్రతీవారం నిర్వహించే సంతలలో (మార్కెట్) కనీస సౌకర్యాలు లేక చిరువ్యాపారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం, గొల్లపల్లిలో శనివారం నిర్వహించే సంతలకు సమీప తండాలు, గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు వచ్చి కూరగాయలు, ఇతర సామగ్రి కొనుగోలు చేస్తారు. కాగా, వర్షాకాలంలో కావడంతో గుంతలమయంగా మారి బురదతో ఇక్కట్లు పడుతున్నారు. రోడ్లపైనే కొనసాగించడంతో వాహనాలు వెళ్తున్న సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రత్యేక స్థలాలు గుర్తించినా అక్కడ ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు.

ఏర్పాట్లలో జాప్యం

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీతో పాటు రాచర్ల గొల్లపల్లిలో వారసంతలకు ప్రత్యేక స్థలాలు ఎంపికచేశారు. ప్రత్యేక స్థలాల్లో షెడ్లు నిర్మించి వసతులు కల్పించాలని పలుసార్లు గ్రామసభల్లో కోరినా ఫలితం లేకుండా పోతోంది. కాగా గొల్లపలిలో ని గ్రామ శివారులో సంతకు అనువైన స్థలం లేక జా ప్యం జరుగుతున్నట్లు పాలకవర్గ సభ్యులు పేర్కొంటున్నారు. ఎల్లారెడ్డిపేట సంతకు సమీప దుమాల, పదిర, నారాయణపూర్, కిషన్‌దాస్‌పేట, సింగారం, బండలింగంపల్లి, అల్మాస్‌పూర్ గ్రామాలకు చెందినవారు, గొల్లపల్లి సంతకు రాచర్ల బొప్పాపూర్, గుండారం, రాజన్నపేట, తిమ్మాపూర్, కిషునాయక్ తండా తదితర గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. వారి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రత్యేక స్థలాలు గుర్తించి వారసంతలు కొనసాగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


రాచర్లగొల్లపల్లిలో రోడ్డుపైనే వారసంత

ఇబ్బంది పడుతున్నాం



కొన్నేళ్లుగా రోడ్లపైనే సంత నిర్వహిస్తున్నారు. ఇరుకు రోడ్ల మధ్యలో సంత నిర్వహించడంతో కూరగాయలు కొనడం ఇబ్బందిగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, పాలకులు చర్యలు తీసుకొని సంతను వేరే చోటుకు మార్చాలి.

– ఖుష్బు శకుంతల, ఎల్లారెడ్డిపేట

స్థలాలు ఎంపిక చేశాం



ఎల్లారెడ్డిపేట, గొల్లపలి వారసంతలకు ప్రత్యేక స్థలాలు ఎంపిక చేశాం. స్థానికంగా గిద్దె చెరువులో స్థలాన్ని ఎంపికచేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గొల్లపల్లిలో అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే రోడ్డుపై నుంచి సంతలను మారుస్తాం. అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



చందుర్తి: మండలకేంద్రంలోని పంటపొలాల మధ్య అలంకారప్రాయంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంలో సెస్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. వైర్లకు విద్యుత్ సరఫరా లేకపోయినా కిందకు వేలాడుతుండడంతో పొలం గట్లపై వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సెస్ అధికారులు వేలాడుతున్న తీగలను తొలగించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : మహేశ్, సెస్ ఏఈ, చందుర్తి సెల్ నం: 94408 14077

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మందుబాబులకు కౌన్సెలింగ్

సిరిసిల్లక్రైం/సిరిసిల్లకల్చరల్: మద్యం తాగి పట్టుబడిన 52 మందికి సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సై దిలీప్ ఆధ్వర్యంలో మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 14 రోజులుగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించగా 52 మంది పట్టుబడినట్లు సీఐ కృష్ణ తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ జరిమానా విధించారు. మద్యం తాగి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేయించారు.

బీడీ కార్మికులకు చేయూతనివ్వాలి


మాట్లాడుతున్న అనసూర్య

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఎన్నికల హామీలు అమలు చేసి చేయూత అందించాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు కేవీ అనసూర్య కోరారు. మంగళవారం కార్మిక భవనంలో మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో లక్షలాది మంది బీడీ రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పని చేస్తున్నారని, బీడీ రంగంపై అనేక ఆంక్షలు విధించిన ప్రభుత్వాలు విదేశీ సిగరెట్ల అమ్మకాలను మాత్రం నిషేధించలేదని విమర్శించారు. బీడీ టేకేదార్లు కంపెనీలు ఇచ్చే కమీషన్ కాకుండా కార్మికుల నుంచి నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల బీడీలు కోత పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించాలని, వీడీఏ ప్రకారం వెయ్యి బీడీలకు రూ.261.97 వేతనం టేకేదార్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రూ.4,016 ఆసరా పెన్షన్ అందించాలని, అర్హులైన కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు నల్ల చంద్రమౌళి, నాయకులు కడారి రాములు, అజ్జ వేణు, ఉపాధ్యక్షులు రేగుల అనిత, గుమ్మడవెల్లి మంజుల, కోశాధికారి సుంకనపెల్లి శాంతమ్మ, కౌన్సిల్ సభ్యులు ఎంజాల లక్ష్మీ, గాజుల రాధ పాల్గొన్నారు.

ముర్రుపాలతో చిన్నారుల్లో నిరోధక శక్తి


వారోత్సవాల్లో అంగన్వాడీ సిబ్బంది తదితరులు

చందుర్తి/వీర్నపల్లి/కోనరావుపేట: ముర్రుపాలతో చిన్నారులతో నిరోధక శక్తి పెరుగుతోందని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. చందుర్తి మండలం తిమ్మాపూర్, రామన్నపేట, ఆశిరెడ్డిపల్లెలో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాన్ని సీడీపీవో ఉమారాణి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చంటి బిడ్డలకు తల్లిపాలే బలమైన పౌష్టికాహారమన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట, సుద్దాల మంగళపల్లి, కనగర్తి, నిమ్మపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి బాలింతలు, గర్భిణులకు వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

తంగళ్లపల్లి: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు. ముగ్దం సురేశ్ (29) కుటుంబ కలహాలతో మద్యానికి బానిసయ్యాడు. పనిచేయకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారు. బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి భార్య స్వరూప, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉండగా కూతురు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మరణించింది. మృతుని చిన్నాన్న మహేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు.

క్లుప్తంగా..

బీజేపీ నాయకుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లిలో పశువైద్యశాలను అసంపూర్తిగా నిర్మించడంపై బీజేపీ నాయకులు మంగళవారం భవనం ఎదుట నిరసన తెలిపారు. వెంటనే పనులు పూర్తి చేయాలని మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేశ్ డిమాండ్ చేశారు. దాసరి పవన్, పిట్ల శ్రీశైలం, కిరణ్‌నాయక్, వంగల దేవయ్య పాల్గొన్నారు.

ఇంటింటా బీజేపీ

ఎల్లారెడ్డిపేట: బీజేపీ మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఇంటింటా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం చేశారు. నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, కిరణ్‌నాయక్ తదితరులున్నారు.

వ్యక్తి రిమాండ్

వేములవాడరూరల్: ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వేములవాడ రూరల్ మండలం వట్టెంల గ్రామానికి చెందిన హుస్సేన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన బొమ్మనవేణి ప్రవీణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతుండగా.. అత్యవసర చికిత్స కోసం విప్ ఆది శ్రీనివాస్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీని మంగళవారం అందజేశారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్: బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలో కాంగ్రెస్ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ముస్తాబాద్ నుంచి ఆ పార్టీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి వెళ్లారు. బీసీల పట్ల బీజేపీ నాయకులకు ప్రేమ లేదన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేశారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సీఎస్ఆర్ నిధులతో మోదీ గిఫ్ట్ పేరిట పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంఈవో రాజునాయక్, హెచ్ఎం శంకర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల సన్నద్ధంపై అవగాహన

వేములవాడఅర్బన్: మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అకాడమిక్, కెరియర్ గైడెన్స్ విభాగాల ఆధ్వర్యంలో డిగ్రీ నుంచే పోటీ పరీక్షలకు ఎలా సంసిద్ధం కావాలనే అంశంపై ప్రిన్సిపాల్ శంకర్, జూనియర్ సహాయకులు ఎం.రంజిత్ అవగాహన కల్పించారు.

టీబీ ముక్త్ భారత్‌పై అవగాహన

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో మంగళవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మెర్సీ, రషీద్, జేత్యా తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామపంచాయతీ పరిధిలో 5 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రేకుల టేల, షెడ్డు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.

నేడు శాస్త్రవేత్తల చర్చాగోష్టి

బోయినపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో బుధవారం తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో చెరుకు పంట– యాజమాన్య పద్ధతులపై రైతులతో శాస్త్రవేత్తల చర్చా గోష్టి నిర్వహించనున్నట్లు ఎంఏవో ప్రణీత తెలిపారు. ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని కోరారు.

అక్రమ దుకాణాలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న సంఘం నాయకులు

ముస్తాబాద్: స్వర్ణకారులు ఉపాధి లేక ఆత్మహత్యలు చేసుకుంటేనే చర్యలు తీసుకుంటారా అని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య అన్నారు. ముస్తాబాద్‌లో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, దుబ్బాక, సిరిసిల్ల స్వర్ణకారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా బాలయ్య మాట్లాడుతూ, నాలుగు నెలలుగా ముస్తాబాద్‌లో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేస్తున్నా.. అక్రమ జువెల్లరీ దుకాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే తమ కార్యాచరణను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. నాయకులు శ్రీనివాస్, నవీన్, అనిల్, సతీశ్, సత్యనారాయణ, రాజు, రమణ, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు


మాట్లాడుతున్న నాయకులు

బోయినపల్లి: రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులు మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారని, తమ అవినీతి బయటపడుతుందనే ఉద్దేశంతో కాంగ్రెస్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్ అన్నారు. మంగళవారం నాయకులు ఏనుగుల కనుకయ్య, సంబ లక్ష్మీరాజంతో కలిసి మండల కేంద్రంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిందని అప్పుడే ఎందుకు మరమ్మతు చేయలేదని మండిపడ్డారు. నాయకులు మహేందర్ ఉన్నారు.

పంటల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు రైతు వేదికలో మంగళవారం ఆచార్య జయశంకర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ మదన్మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి, ఏఈవో లలిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న యూఎస్‌పీసీ నాయకులు

సిరిసిల్లఅర్బన్: విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఉపాధ్యాయ సంఘాలు, యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు పాతూరి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి, పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలన్నారు. పెండింగ్ డీఏలు చెల్లించాలని, ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గోల్కొండ శ్రీధర్, రాజేశ్వర్‌రావు, రాంనాథ్‌రెడ్డి, రవీందర్, సుధాకర్‌రెడ్డి, అంజయ్య, రాజు, తిరుపతి, శ్రీహరి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ అక్రమాలపై నిగ్గు తేల్చాలి


మాట్లాడుతున్న క్రాంతికుమార్

ముస్తాబాద్: మండలంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చేసిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ముస్తాబాద్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని, అక్రమ వెంచర్లు వెలిశాయన్నారు. కెనాల్, వాగుల వెంబడి ఉన్న భూములు కబ్జాకు గురైన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పాలన్నారు. కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో జరుగుతున్న భూ కబ్జాలపై స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. నాయకులు మెంగని మహేందర్, చిగురు వెంకన్న, చిట్నేని శ్రీనివాస్‌రావు, కృష్ణ, తిరుపతి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రమాసత్యనారాయణస్వామి కల్యాణం.. కుంకుమపూజలు


ముస్తాబాద్: గాయత్రి మాత ఆలయంలో పూజలు


ఇల్లంతకుంట: గంగాధర క్షేత్ర ఆలయంలో..

ముస్తాబాద్: మండలంలోని తెర్లుమద్దిలో గాయత్రి కొండపై మంగళవారం శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీగాయత్రి మాత ఆలయంలో గణపతి హోమం, అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం శ్రీరమాసత్యనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు.

దుర్గామాతకు కుంకుమపూజ

ఎల్లారెడ్డిపేట: శ్రావణమాస పుత్రిక ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ దుర్గామాత ఆలయంలో మహిళలు కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు.

దత్తాలయంలో గిరిప్రదక్షిణ

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై స్వయంభూగా వెలసిన గురు దత్తాత్రేయస్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా భక్తులు గిరిప్రదక్షిణ నిర్వహించారు.

పోచమ్మతల్లికి మకర తోరణం

బోయినపల్లి: మండలంలోని తడగొండ గ్రామ పోచమ్మ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారికి మంగళవారం రేగూరి శోభారాణి రవీందర్ దంపతులు మకరతోరణం, గంట బహూకరించారు.


బోయినపల్లి : మకరతోరణం బహూకరణ

సామూహిక కుంకుమార్చన

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని శ్రీగంగాధర క్షేత్ర ఆలయంలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

వర్షాలు కురవాలని జలాభిషేకం

రుద్రంగి: వర్షాలు కురవాలని మంగళవారం మండలంలోని బడితండా గ్రామ గిరిజనులు సేవాలాల్ మహరాజ్, మేరమ్మ, హనుమాన్ ఆలయాల్లో స్వామివారలకు జలాభిషేకం, పూజలు చేశారు.

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

వేములవాడ: సిరిసిల్ల పట్టణంలోని షాదీఖానాలో ఈనెల 3న నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేములవాడకు చెందిన ఒకినావ స్పోర్ట్స్ అకాడమీ 40 మంది క్రీడాకారులు పతకాలు సాధించినట్లు అకాడమీ ఫౌండర్ అబ్దుల్ మన్నాన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు 20 బంగారు, 8 వెండి, 12 కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. విజేతలను సీనియర్ మాస్టర్లు కె.వసంత్‌కుమార్, అక్బర్‌ఖాన్, కరాటే మాస్టర్లు విజయ్, శ్రీధర్‌గౌడ్, రామకృష్ణ, కనకరాజు అభినందించారు.